సాక్షి
కుమురం భీం

మంగళవారం ◆ 9 ◆ జనవరి ◆ 2024



ఘనంగా భీమదేవర పండుగ

జిల్లావ్యాప్తంగా భీమదేవర జెండా పండుగను మన్నెవార్ కులస్తులు ఘనంగా నిర్వహించారు. భీమన్న ఆలయాల్లో బోనాలు సమర్పించారు. 9లో▸



అక్షింతలతో శోభాయాత్ర

పలు మండలాల్లో సోమవారం అయోధ్య అక్షింతలతో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో శ్రీరాముని నామస్మరణ మార్మోగింది. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.9 /17.8

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం కాస్త తగ్గుతుంది. ఉదయం పొగ మంచు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జెడ్పీ చైర్‌పర్సన్ కోనేరు కృష్ణారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడామైదానంలో ఎంపీపీ కప్ పోటీలను సోమవారం జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, డీటీడీవో రమాదేవి, డీఈవో అశోక్, జిల్లా రవాణా అధికారి లక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు వెలికి తీసేందుకు పోటీలు ఉపయోగపడతాయన్నారు. ఎంపీపీ కప్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, డీఎస్‌వో మీనారెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సాంబశివరావు, ఎంఈవో మానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా మొబైల్ మెడికల్ యూనిట్‌లో పోస్టుల నియామకానికి ఒప్పంద ప్రాతిపదికన అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి తుకారాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల ఫార్మట్, మార్గదర్శకాలు https://asifabad.telangana.gov.in నుంచి పొందవచ్చన్నారు. దరఖాస్తులను పూర్తి వివరాలతో నింపి సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో స్వయంగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించాలని సూచించారు. ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయానికి దరఖాస్తులు పంపించాలని కోరారు.

మెదక్ లోక్‌సభ ఇన్‌చార్జిగా 'పాల్వాయి'



ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కౌటాల(సిర్పూర్): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ అధిష్టానం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా సోమవారం రాష్ట్రంలోని లోక్‌సభ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలను నియమించింది. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మెదక్ లోక్‌సభ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేస్తామని హరీశ్‌బాబు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులతో హెచ్‌ఎం, తదితరులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం కోటేశ్వర్ తెలిపారు. విద్యార్థులను సోమవారం పాఠశాల ఆవరణలో సంచాలిత సమితి అధ్యక్షుడు సతీష్‌బాబు, కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 6న రాంపూర్‌లో జరిగిన జిల్లాస్థాయి ఖేల్‌కూద్(రన్నింగ్) 100, 400 మీటర్ల పోటీల్లో రక్షిత ప్రథమ బహుమతి, 400, 200, 800 మీటర్ల రన్నింగ్‌లో మరో ఐదుగురు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలిచినట్లు వెల్లడించారు. ఈ నెల 28 నుంచి 30 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని పేర్కొన్నారు. సభ్యులు విశాల్, కమలాకర్ తదితరులు ఉన్నారు.

వర్ధంతి సభ ఏర్పాట్లు పూర్తి చేయాలి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

జైనూర్: మండలంలోని మార్లవాయిలో ఈ నెల 11న నిర్వహించే ప్రొ.హైమన్ డార్ఫ్ వర్ధంతి సభకు ఏర్పాట్లు చేయాలని గౌరవ కమిటీ అధ్యక్షుడు కనక వెంకటేశ్ అన్నారు. సోమవారం ఐటీడీఏ ఏఈ శివకుమార్, జేఈ ఇందల్‌సింగ్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. రహదారిపై గుంతలు ఉన్న చోట మొరం పోయించారు.



కెరమెరి మండలం కేస్లాగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడాప్రాంగణం ఇది. కనీసం భూమిని సక్రమంగా చదును చేయకుండానే బోర్డు ఏర్పాటు చేసి వదిలేశారు. క్రీడాకారులతోపాటు కనీసం వ్యాయామం కోసం కూడా ఇక్కడికి ఎవరూ రావడం లేదు.



ఇక్కడ కనిపిస్తున్న ఖాళీ స్థలం వాంకిడి మండలం ఖమాన గ్రామానికి కేటాయించిన తెలంగాణ క్రీడా ప్రాంగణం. స్థలం కేటాయించినా ఇప్పటివరకు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. గ్రామానికి దూరంగా ఉండటంతో గ్రౌండ్‌కు వెళ్లేందుకు గ్రామస్తులు ఆసక్తి చూపడం లేదు.



కౌటాల మండలం బోదంపల్లి గ్రామంలో క్రీడాప్రాంగణాన్ని సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఇది పేరుకే క్రీడామైదానం. ఇక్కడ విద్యార్థులు మాత్రమే ఆటలు ఆడుకుంటున్నారు. క్రీడాకారులు, గ్రామస్తులకు ఎలాంటి ఉపయోగం ఉండటం లేదు.

ఆర్భాటమే.. ఆటలాడేదెక్కడ?

ఈ ఫొటోలో కనిపిస్తున్న తెలంగాణ క్రీడా ప్రాంగణం మండల కేంద్రంలో ఏర్పాటు చేసింది. ఇక్కడ ఎక్సర్‌సైజ్‌లు చేసేందుకు ఒక మెటల్ బార్ ఏర్పాటు చేశారు. మిగిలిన సౌకర్యాలు ఏమీ లేవు. స్థలం చదును కూడా చేయలేదు. వర్షాకాలంలో పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. వాకింగ్ చేయడానికి కూడా అనువుగా లేదు. గతేడాది పంపిణీ చేసిన స్పోర్ట్స్ కిట్లతో యువకులు స్థానిక పాఠశాల మైదానంలో ఆటలు ఆడుతున్నారు.





ఈ క్రీడా ప్రాంగణం దహెగాం మండలం పార్వతిపేట గ్రామంలో ఏర్పాటు చేశారు. మండల కేంద్రానికి పార్వతిపేట సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆ గ్రా మంలో క్రీడాప్రాంగణం ఏర్పాటుకు స్థలం దొ రకకపోవడంతో దహెగాంలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం వద్దే మరో క్రీడాప్రాంగణం ఏ ర్పాటు చేశారు. పార్వతిపేట నుంచి మండల కేంద్రానికి ప్రత్యేకంగా ఆటల కోసం ఎవరూ రాక ప్రస్తుతం నిరుపయోగం మారింది.

- నిరుపయోగంగా మారిన క్రీడాప్రాంగణాలు
- గ్రామాల చివర ఏర్పాటు చేయడంతో అధ్వానంగా పరిసరాలు
- స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేసినా.. ప్రయోజనం సున్నా
- నిర్వహణపై దృష్టి సారించాలని క్రీడాకారుల వేడుకోలు

దహెగాం(సిర్పూర్): కోవిడ్ అనంతర పరిస్థితుల్లో ప్రజలకు ఆరోగ్యం రక్షణపై అవగాహన పెరిగింది. ప్రతిఒక్కరూ ఆహారపు అలవాట్లు మార్చుకోవడంతోపాటు కనీస శారీరక వ్యాయమంపై దృష్టి సారిస్తున్నారు. గ్రామాల్లోని క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడంతోపాటు ప్రజలకు అందుబాటులో మైదానాలు ఉండాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో క్రీడాప్రాంగాణాల ఏర్పాటుకు నిర్ణయించింది. నిధులు కూడా విడుదల చేయడంతో అధికారులు ఆర్భాటంగా మైదానాలు ఏర్పాటు చేశారు. అయితే అధికారుల ఆర్భాటం కొన్నిరోజులకే పరిమితమైంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల క్రీడామైదానాలు నిరుపయోగంగా మారాయి. క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేసినా.. వాటిని మూలకు పడేయాల్సిన పరిస్థితి. ఇంకా కొన్నిచోట్ల స్థలాలు గుర్తించకపోవడం, గుర్తించిన చోట కూడా క్రీడాప్రాంగణాలు పూర్తి చేయకపోవడంతో అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.

1,102 క్రీడాప్రాంగణాల ఏర్పాటు లక్ష్యం..

జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రామాలు, మున్సిపాలిటీలో మొత్తం 1,102 క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో 902 చోట్ల స్థలాలు గుర్తించారు. మరో 200 వరకు క్రీడాప్రాంగణాలకు స్థలాలు గుర్తించాల్సి ఉంది. ఇప్పటివరకు 878 క్రీడాప్రాంగణాల్లో పూర్తి చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. చాలా మైదానాల నిర్వహణను పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలే దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల కనీసం స్థలాలను చదును కూడా చేయించలేదనే ఆరోపణలు ఉన్నాయి. కాంగ్రెస్ సర్కారు క్రీడాప్రాంగణాలపై దృష్టి సారించి సౌకర్యాలు కల్పించాలని, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిధుల కొరతతోనే..

నిధుల కొరతతో జిల్లాలోని కొన్నిచోట్ల క్రీడాప్రాంగాణాల ఏర్పాటు, సౌకర్యాల కల్పన పనులు ముందుకు సాగలేదు. క్రీడాకారులకు అవసరమైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించాం. చదును చేసి వినియోగంలోకి తీసుకువస్తాం. క్రీడాసామగ్రి కూడా పంపిణీ చేసిన నేపథ్యంలో మైదానాలను యువత సద్వినియోగం చేసుకోవాలి.

– సురేందర్, డీఆర్‌డీవో

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పార్లమెంట్ ఎన్నికల కోసం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని ఆదేశించారు. ఆయా కేంద్రాల మ్యాపింగ్ తయారు చేసి నివేదిక సమర్పించాలన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి సెక్టార్ పరిధిలోని రూట్లలో ఎలాంటి సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకర్గాల్లో 87 సెక్టార్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శాసన సభ ఎన్నికల్లో సందర్భంగా జరిగిన ఘటనలు, కేసుల వివరాల నివేదికలు పూర్తిస్థాయిలో అందించాలని ఆదేశించారు. సమావేశంలో కాగజ్‌నగర్ ఆర్డీవో సురేశ్, డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.


పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారం జిల్లా కేంద్రంలో డీఈవో అశోక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ గతేడాది జూలైలో నూతనంగా ఉద్యోగంలో చేరిన ఎంఐఎస్, ఐఈఆర్‌పీఎస్, కేజీబీవీ, పీజీ సీఆర్టీ, నాన్‌టీచింగ్ సిబ్బందికి నేటి వరకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ఒత్తిడి తగ్గించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తుకారాం, నాయకులు మోహన్, నగేశ్, సంతోష్, రమేశ్, సుభాష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గుట్టుచప్పుడు కాకుండా కోడి పందేలు



ఖేడెగాం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఏర్పాట్లు




కోడిపుంజులతో పందెంరాయుళ్లు

వాంకిడి(ఆసిఫాబాద్): అధికారుల హెచ్చరికలను పట్టించుకోకుండా పందెం రాయుళ్లు రెచ్చిపోతున్నారు. మహారాష్ట్ర సరిహద్దుతోపాటు వాంకిడి మండలంలోని అటవీ ప్రాంతాల్లో కోడిపందేలు నిర్వహిస్తున్నారు. వాంకిడి మండలం వెల్గి పంచాయతీ పరిధిలోని ఖేడెగాం సమీపంలోని కాలువ పక్కన అటవీ ప్రాంతంలో ఆదివారం కోడి పందేలు జోరుగా సాగాయి. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆసిఫాబాద్, భీంపూర్(చోర్‌పల్లి), గుండి గ్రామాలతోపాటు వాంకిడి మండలంలోని కనర్‌గాం గ్రామానికి చెందిన కొంతమంది నిర్వాహకులు, పందెంరాయుళ్లు పాల్గొనట్లు సమాచారం. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పందేలు సాగినట్లుగా తెలుస్తోంది. అలాగే వాంకిడి మండలం ఇందాని గ్రామ పంచాయతీ సమీపంలో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోనూ ఆదివారం కోడి పందేలు నిర్వహించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ప్రత్యేకంగా పెంచిన కోడి పుంజులతో బెట్టింగ్ నిర్వహించగా.. భారీగా డబ్బు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది. రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు బెట్టింగ్ కాసినట్లు సమాచారం. కోడి పందేల విషయంపై వాంకిడి ఎస్సై సాగర్‌ను వివరణ కోరగా.. ఖెడేగాం సమీపంలో కోడిపందేలు నిర్వహించినట్లు సమాచారం వచ్చిందని ధ్రువీకరించారు. రైడ్ చేసేందుకు వెళ్లగా అప్పటికే అందరూ పారిపోయారని తెలిపారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై సీఎం ఫోకస్

- ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జీలతో సమీక్ష
- ఈ నెల 26 తర్వాత ఇంద్రవెల్లి పర్యటన



సీఎం రేవంత్‌రెడ్డితో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సమీక్షా సమావేశాలను ఆదిలాబాద్ జిల్లా నుంచే శ్రీకారం చుట్టారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు వినోద్, వివేక్, ప్రేమ్‌సాగర్‌రావు, వెడ్మ బొజ్జు, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాసరెడ్డి, ఆడే గజేందర్, కూచాడి శ్రీహరిరావుతో సీఎం సోమవారం సమావేశమయ్యారు. నియోజకవర్గాల్లో సమస్యలపై ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలను అడిగి తెలుసుకున్నారు. వారు కూడా తమ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల అభివృద్ధితో పాటు ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల సంక్షేమ ఫలాలు అర్హులైన వారికి అందించడమే లక్ష్యంగా ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం వారికి దిశానిర్దేశం చేసినట్లుగా తెలిసింది. సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తానని భరోసా ఇచ్చినట్లు సమాచారం. కాగా సీఎం జిల్లాల పర్యటన ఈ నెల 26 నుంచి చేపట్టనున్నారని, ఇందులో భాగంగా తొలి పర్యటన ఇంద్రవెల్లి నుంచే ప్రారంభం కానుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం వద్ద చేపట్టనున్న అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నట్లుగా ఆయన వివరించారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల ఏఎన్‌ఎంలు ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పొరుగు సేవల పద్ధతిన తమను విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఎడమ చేతి నాలుగు వేళ్లు ముడుచుకుని ఉన్నాయని, సదరం శిబిరంలో వైకల్య శాతం సున్న వచ్చిందని, మరోసారి అవకాశం కల్పించాలని కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన కొట్రంగి స్వరూప దరఖాస్తు చేసుకుంది. వితంతు పింఛన్ మంజూరు చేయాలని కాగజ్‌నగర్ పట్టణంలోని కీసర్‌నగర్‌కు చెందిన రజియా బేగం అర్జీ సమర్పించింది. రోజువారీ కూలీ చేసుకొని జీవిస్తున్న తనకు ఉపాధి కల్పించాలని వాంకిడి మండలం ఖిరిడి గ్రామానికి చెందిన జాడి సునీత వేడుకుంది. వినికిడి లోపం ఉన్నందున సదరం క్యాంపులో పరీక్షలు చేయించుకున్నానని, ఇప్పటివరకు ఎలాంటి సర్టిఫికెట్ రాకపోవడంతో మీసేవ కేంద్రానికి వెళ్తే అనర్హురాలిగా చూపిస్తుందని న్యాయం చేయాలని పెంచికల్‌పేట్ మండలం కమ్మర్‌గాం గ్రామానికి చెందిన చెన్నూరి చిన్నక్క కోరింది. చెవుడు, మూగ దివ్యాంగుడైన తాను డిగ్రీ పూర్తి చేశానని, ఉపాధి కల్పించాలని కాగజ్‌నగర్‌లోని పెట్రోల్‌పంపు ఏరియాకు చెందిన విజయ్‌కుమార్ దరఖాస్తు చేసుకున్నాడు. భార్య దూరిబాయి పేరిట గ్రామ శివారులో ఉన్న భూమిని ఆమె మరణానంతరం కుమారులు పట్టా చేయించుకున్నారని, విచారించి న్యాయం చేయాలని జైనూర్ మండలం జంగావు కిషన్ నాయక్ తండాకు చెందిన రాథోడ్ శంకర్ కోరాడు. వాంకిడి మండలం గోయగాంకు చెందిన దుర్వాస గుప్తా బసు గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులో తనకు అవకాశం కల్పించాలని కోరింది. తనకు చెవుడు ఉందని, గతంలో లోకో మోటార్‌గా దరఖాస్తు చేశామని, దీనిని చెవుడుగా మార్చేందుకు అవకాశం కల్పించాలని వాంకిడి మండలం నవగూడకు చెందిన వి.శంకర్ దరఖాస్తు చేసుకున్నాడు.

గిన్నెధరి జీపీలోనే కొనసాగించాలి

మాది తిర్యాణి మండలంలోని చౌపన్‌గూడ గ్రామం. గతంలో గిన్నెధరి గ్రామ పంచాయతీ పరధిలో ఉండగా, ప్రస్తుతం ఖైర్‌గూడ జీపీలో కలిపారు. గ్రామ పంచాయతీ మారడంతో మౌలిక వసతులు అందడం లేదు. సీసీరోడ్డు మంజూరైనప్పటికీ నిర్మించడం లేదు. గతంలో ఉన్న ఐసీడీఎస్, అంగన్‌వాడీ కేంద్రాలు ఇప్పుడు పని చేస్తలేవు. చౌపన్‌గూడను గిన్నెధరి గ్రామ పంచాయతీలోనే కొనసాగించాలి.



కలెక్టరేట్‌లో చౌపన్‌గూడ గ్రామస్తులు

పింఛన్ బందయింది



నాకు ఓ కన్ను కనబడదు. ఐదేళ్లపాటు దివ్యాంగ పింఛన్ వచ్చింది. సదరం సర్టిఫికెట్ రెన్యూవల్ కోసం స్లాట్ బుక్ చేస్తే కావడం లేదు. మూడేళ్లుగా పింఛన్ బందయింది. సదరం సర్టిఫికెట్ ఇప్పించాలి.

– చునార్కర్ లింగయ్య, కిష్టాపూర్, మం.రెబ్బెన

విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలి



రెండేళ్ల కింద గిరివికాస్ పథకం కింద చేనులో బోరు వేశారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో సోలార్ సిస్టం ఏర్పాటు చేశారు. కొద్దిరోజులుగా సోలార్ పనిచేయడం లేదు. చేను వరకు లైన్ వేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి.

– ఆత్రం కమ్ము, చౌపన్‌గూడ, మం.వాంకిడి

సదరం సర్టిఫికెట్ ఇప్పించాలి



నేను మానసిక దివ్యాంగురాలిని. సదరం సర్టిఫికెట్ లేకపోవడంతో రైల్వేపాస్ లభించడం లేదు. అధికారులు స్పందించి సదరం సర్టిఫికెట్ అందించాలి.

– కంచన్‌శర్మ, కాగజ్‌నగర్

క్లుప్తంగా

గంజాయి కేసులో ముగ్గురి బైండోవర్



బైండోవర్ అయిన నిందితులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గంజాయి అక్రమ రవాణా కేసులో ముగ్గురు నిందితులను సోమవారం హాజీపూర్ పోలీసులు బైండోవర్ చేశారు. హాజీపూర్ మండలం కర్ణమామిడికి చెందిన చిట్యాల సుధాకర్, మంద హృతిక్, పెద్దంపేటకు చెందిన దుర్గం రాజ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని బైండోవర్ చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

కుక్కకాటుకు బాలునికి గాయాలు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని రాజంపేటలో శౌర్యభ్ (08) అనే బాలుడిని సోమవారం వీధి కుక్క కరవడంతో కుడి కాలుకు గాయమైంది. వెంటనే తల్లిదండ్రులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీధి కుక్కలను అరికట్టాలని కోరుతున్నారు.

కారు ఢీకొని యువకుడు మృతి





ప్రమాద స్థలంలో మృతదేహం ప్రసాద్ (ఫైల్)

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లి వైకుంఠ ధామం సమీపంలో సోమవారం కారు ఢీకొని యువకుడు మృతి చెందినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. వేమనపల్లి మండలం జిల్లెడ గ్రామానికి చెందిన చిప్ప ప్రసాద్ (26) ఓ ప్రైవేటు ట్రిప్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా బైక్‌పై దండేపల్లికి వచ్చి వెళ్తుండగా లక్సెట్టిపేట వైపు నుంచి ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య



రాజమల్లు మృతదేహం

చెన్నూర్: చెన్నూర్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు కోటపల్లి మండలం రొయ్యలపల్లికి చెందిన దుర్గం రాజమల్లు (40)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మృతునికి రెండెకరాల భూమి ఉందని, పంటల కోసం చేసిన అప్పులు ఉన్నాయని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కాలనీలను కమ్మేస్తున్న పొగ

- శ్వాస తీసుకోవడంలో చిన్నారులు, వృద్ధుల ఇబ్బందులు
- ముందస్తు ప్రణాళికలు లేకుండా డంప్‌యార్డ్ ఏర్పాటు
- పొగతో నరకయాతన అనుభవిస్తున్న పలు కాలనీల ప్రజలు
- కార్మికుల ఆరోగ్యంపై దుష్ప్రభావం



డంప్‌యార్డు నుంచి వెలువడుతున్న పొగ



డంప్‌యార్డును పరిశీలిస్తున్న కమిషనర్, కౌన్సిలర్లు

నస్పూర్: పట్టణ పరిధిలోని పలు కాలనీల్లో ఆదివారం రాత్రి దుర్వాసనతో కూడిన దట్టమైన పొగ కమ్మేసింది. కాలనీ వాసులకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు. ఎక్కడైనా అగ్నిప్రమాదం జరిగిందేమోనని ఆరా తీయడం మొదలు పెట్టారు. డంప్‌యార్డులో చెత్తను తగులబెట్టారని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు ఫైరింజన్, నాలుగు వాటర్ ట్యాంకర్లతో మంటలు ఆర్పివేయించారు. సోమవారం ఉదయం కమిషనర్ రమేశ్ కౌన్సిలర్లు తోట శ్రీనివాస్, సురిమిల్ల వేణు డంప్‌యార్డును పరిశీలించారు.

తరచూ పునరావృతం...

డంప్‌యార్డులోని చెత్తకు నిప్పు పెడుతుండడంతో దానినుంచి వెలువడే పొగ రోజుల తరబడి కాలనీలను కమ్మేయడం లాంటి ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. అయినా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ప్రతీరోజు చీకటి అయ్యిందంటే అంటే చాలు.. సీసీసీ ఆర్కే 5 కాలనీ సమీపంలోని డంప్‌యార్డు నుండి వెలువడే దుర్వాసనతో కూడిన పొగ పట్టణ పరిధిలోని పలు కాలనీలు కమ్మేస్తుంది. దీంతో కాలనీవాసులు రాత్రి 7 అయ్యిందంటేనే తలుపులు వేసుకుని ఇంట్లో గడపాల్సిన పరిస్థితి. ఒకవైపు చలికాలంలో పడిపోయిన ఉష్ణోగ్రతలు, మరోవైపు కాలుష్యంతో నిండిన పొగ పీల్చుకోవడం వల్ల వృద్ధులు, చిన్నారులు శ్వాస తీసుకోవడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సింగరేణి స్థలంలో ఏర్పాటు ...

సీసీసీ ఆర్కే 5 కాలనీ సమీపంలో సింగరేణి సంస్థకు చెందిన సుమారు పదెకరాల స్థలంలో అధికారుల అనుమతితో మున్సిపల్ అధికారులు డంప్‌యార్డు ఏర్పాటు చేశారు. కానీ అట్టి స్థలాన్ని సింగరేణి అధికారులు రాతపూర్వకంగా మున్సిపాలిటీకి కేటాయించలేదు. దీంతో మున్సిపల్ అధికారులు ఆ స్థలంలో ప్రతీరోజూ సేకరించిన చెత్తను డంపింగ్ చేస్తున్నా ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదు. ఆకతాయిలు తరచూ చెత్తను తగలబెడుతుండడంతో అందులో నుంచి వచ్చే దుర్వాసన, పొగతో ఆర్కే 5, సీసీసీ టౌన్‌షిప్, నాగార్జున, న్యూనాగార్జున, షిర్కే, తాళ్లపల్లి ఆర్ అండ్ బీ కాలనీ, సింగాపూర్ ఆర్అండ్ఆర్‌కాలనీ, సుందరయ్య కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డుకు సమీపంలో ముక్కిడి పోచమ్మ గుడి, చర్చిలకు వచ్చే భక్తులు, ఆర్కే 5 కాలనీలో వృద్ధాశ్రమంలోని వృద్ధులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేయాల్సి ఉండగా...

మున్సిపల్ సిబ్బంది సేకరించిన చెత్తలో నుంచి తడి, పొడి చెత్తను వేరుచేసి సేంద్రియ ఎరువుగా మార్చి ఇతర అవసరాలకు వినియోగించాలి. కానీ మున్సిపల్ అధికారులు ఆ దిశగా ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. దీంతో డంప్‌యార్డులో చెత్త పేరుకుపోతోంది.

ప్రతీరోజు 22 మెట్రిక్ టన్నుల చెత్త

పట్టణ పరిధిలో ప్రతీరోజు 22 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. ఇందులో 7.7 మెట్రిక్ టన్నుల తడిచెత్త, 13.64 మెట్రిక్ టన్నుల పొడిచెత్త, 0.66 మెట్రిక్ టన్నుల హానికరమైన చెత్త వెలువడుతుంది. చెత్త సేకరణకు 34 ట్రాలీలు, రెండు ట్రాక్టర్లు వినియోగిస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

ప్రస్తుతం పట్టణ జనాభా సుమారు 85 వేలకు పైచిలుకు ఉంటుంది. రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో చెత్త సైతం పెరుగుతుంది. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అన్ని ఆధునిక సౌకర్యాలతో కూడిన డంప్‌యార్డు ఏర్పాటు చేయాలి. చెత్త పేరుకుపోకుండా చేసి సమస్యకు పరిష్కారం చూపేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు

డంప్‌యార్డులో వేసిన చెత్తకు ఆకతాయిలు నిప్పు పెడుతుండడంతో సమస్య ఉత్పన్నం అవుతోంది. అధికారులతో చర్చించి బయో మైనింగ్ పద్ధతిలో ప్రస్తుతం ఉన్న చెత్తను తొలగించేలా చేస్తాం. డంప్‌యార్డు నుంచి దుర్వాసన, పొగరాకుండా తగిన చర్యలు తీసుకుంటాం. సమస్య శాశ్వత పరిష్కారానికి సైతం చర్యలు తీసుకుంటాం.

– టీ.రమేశ్, మున్సిపల్ కమిషనర్, నస్పూర్

ఫిషరీస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణ



నియామకపత్రం అందుకుంటున్న కృష్ణ

చెన్నూర్: తెలంగాణ ఫిషరీస్ సొసైటీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన సాధనబోయిన కృష్ణ నియామకమయ్యారు. సొసైటీ వ్యవస్థాపకుడు పిట్టల రవీందర్, నీల విప్లవ ప్రదాత, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎంవీ గుప్తా చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను జిల్లాలోని మత్స్యకారులకు అందేలా కృషి చేస్తానన్నారు.

'దిందా'లో పురాతన విగ్రహాలు లభ్యం



పురాతన విగ్రహాలు

చింతలమానెపల్లి: మండలంలోని దిందా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో సోమవారం పురాతన విగ్రహాలు లభ్యమయ్యాయి. కుమారస్వామి, ఆంజనేయుడు, నందీశ్వరుడి విగ్రహాలుగా గుర్తించిన గ్రామస్తులు వాటికి పూజలు నిర్వహించారు. మరికొన్ని విగ్రహాలు ఉన్నప్పటికీ శిథిలావస్థలో ఉండడంతో గుర్తించలేక పోయినట్లు తెలిపారు. విషయం బయటకు తెలియడంతో స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకుంటున్నారు.

'కార్మికులకు సరిపడా లాకర్లు ఏర్పాటు చేయాలి'



వినతిపత్రం ఇస్తున్న ఐఎన్టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: గనిపై కార్మికులకు సరిపడా లాకర్లు ఏర్పాటు చేయాలని ఐఎన్టీయూసీ నాయకులు యజమాన్యాన్ని కోరారు. ఆర్కే 5గనిలో శనివారం రాత్రి దొంగలు పడి చెక్కలాకర్లు పగలగొట్టి అందులో కార్మికులు దాచుకున్న సెల్‌ఫోన్లు, కొంత నగదు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ నాయకులు సోమవారం గని రక్షణ అధికారి శివయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్కే 5బీ గనిని ఇటీవల మూసివేసి కార్మికులను ఆర్కే 5 గనిలో విలీనం చేశారని, వారందరికీ సరిపడా లాకర్లు లేవన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు ఈ.మల్లారెడ్డి, శ్రీనివాస్‌రావు, సురేందర్‌రెడ్డి, ప్రతాప్, రాజేందర్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

'చలో ప్రజావాణి విజయవంతం చేయాలి'



మాట్లాడుతున్న అంబాల ఓదెలు

రెబ్బెన: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అందించాలని కోరుతూ ఈనెల 9వ తేదీన సీఎం రేవంతిరెడ్డిని కలిసి దరఖాస్తులు అందించేందుకు నిర్వహించే చలో ప్రజావాణి కార్యక్రమాన్ని కార్మికులంతా విజయవంతం చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు కోరారు. సోమవారం కై రిగూడ ఓసీపీ, మాదారం, సివిల్ డిపార్టుమెంట్, బ్లాస్టింగ్, సివిక్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు పెరగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చారీ, ఇస్తారి, పర్వతాలు, కొమురన్న, తిరుపతి, బుచ్చయ్య, రాజన్న, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య



శేక్ రియాజ్(ఫైల్)

జైనూర్: అప్పుల బాధ భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని పవర్‌హౌస్ కాలనీకి చెందిన శేక్ రియాజ్ (46) ఆదివారం ఐచర్ వాహనం తీసుకొని పనుల నిమిత్తం కెరమెరికి వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం తెల్లవారుజామున ఓ ఐచర్ వాహనానికి రియాజ్ మృతదేహం వేలాడుతుండటం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య అబేధాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

'అధికారుల నిర్లక్ష్యంతోనే సర్దార్ మృతి'

శ్రీరాంపూర్: అధికారుల నిర్లక్ష్యంతోనే మైనింగ్ సర్దార్ మచ్చ రమేశ్ మృతి చెందాడని ఏఐటీయూసీ మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ రీజియన్ కార్యదర్శి వంగరి రాజేశ్వర్‌రావు, ఇన్‌చార్జి గోపతి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కాసిపేట 2 గనిలో విధులు నిర్వహిస్తున్న రమేశ్ 16 రోజుల క్రితం గనిలో జారిపడడంతో ఎడమ మడమ కాలు విరిగింది. సాధారణ చికిత్సలు చేయడంతో పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. దీనికి యాజమాన్యమే బాధ్యత వహించాలని, నిర్లక్ష్యం వహించిన వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

రూ.కోటి పరిహారం చెల్లించాలి

రమేశ్ కుటుంబానికి రూ.కోటి పరిహారం అందించాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మంచిర్యాలక్రైం: స్థానిక గోదావరినదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు అంతర్‌గామ్ ఎస్సై సంతోష్ తెలిపారు. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి మంచిర్యాల నుంచి గోలివాడ వైపునకు కాలి నడకన దాటే ప్రయత్నం చేయగా మార్గమధ్యలో నీటిలో మునిగాడు. మృతుని వయస్సు 40 సంవత్సరాలు ఉంటుంది. మృతుడు నీలిరంగు టీషర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మెడలో నలుపు రంగు తాయిత్తు ఉంది. మృతదేహాన్ని గోదావరిఖనిలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. వివరాలు తెలిసిన వారు 8712656527 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గంజాయి కేసులో ముగ్గురి బైండోవర్

బెల్లంపల్లి: గంజాయిని అక్రమంగా రవాణా చేసిన కేసుల్లో ముగ్గురు నిందితులను సోమవారం పోలీసులు బైండోవర్ చేశారు. కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన ఎస్‌కే ముజ్జు అలియాస్ సల్మాన్, బాబుక్యాంపు బస్తీ వాసి చీమల సాగర్, కూరగాయల మార్కెట్ ఏరియాలో నివశిస్తున్న ఎండి .తాజ్ అలియాస్ లాడెన్‌లను స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

నీటిగుంటలో పడి యువకుడు మృతి



పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: స్థానిక శాలివాహన పవర్ ప్లాంట్‌కు చెందిన నీటి గుంటలో పడి ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రంగపేటకు చెందిన బోగాల పోచమల్లు కుమారుడు అశోక్(36) చేపలు పట్టేందుకు వెళ్లి నీటి గుంట సమీపంలో కూర్చోని ఉండగా ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు అదే నీటి గుంటలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం

భీమిని: మండల కేంద్రంలో గడ్డిలోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగాయి. ట్రాక్టర్ డ్రైవర్ అదే సాయి చాకచక్యంగా వాహనాన్ని వెంటనే ఊరి బయటకు తరలించి పెను ప్రమాదం జరగకుండా జాగ్రత్త పడ్డాడు. భీమిని నుంచి మాడవెల్లికి గడ్డి లోడ్‌తో వస్తుండగా మండల కేంద్రంలోని మీ సేవ వద్ద విద్యుత్ తీగలు తాకడంతో ఘటన చోటు చేసుకుంది. డ్రైవర్ చాకచక్యం వల్లే ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. కాగా ట్రాక్టర్‌లోని గడ్డి దగ్ధమైంది.

జాతీయ సెమినార్‌కు ముస్తాబు

- నేడు భైంసా డిగ్రీ కళాశాలలో హిందీపై సెమినార్
- హాజరు కానున్న వివిధ రాష్ట్రాల ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్లు



భైంసాలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

భైంసాటౌన్: నిర్మల్ జిల్లా భైంసాలోని గోపాల్‌రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయస్థాయి సెమినార్‌కు ముస్తాబైంది. మంగళవారం హిందీపై నిర్వహించే సెమినార్‌కు వివిధ రాష్ట్రాల ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్లు హాజరు కానున్నారు. వివిధ అంశాలపై విస్తృత చర్చద్వారా ఆయా అంశాలపై కళాశాల విద్యార్థులు ప్రేరణ పొంది భవిష్యత్‌లో ఉన్నతులుగా ఎదిగేలా కళాశాల అధ్యాపక బృందం ప్రోత్సాహం అందిస్తోంది. ఇందులో భాగంగా సెమినార్లు నిర్వహిస్తోంది. గతేడాది కళాశాలకు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ బాటనీ ప్రొఫెసర్ వెల్మ మధు ఆధ్వర్యంలో 'అటవీ సంపద, వైవిధ్యం, వినియోగం, సంరక్షణ' అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి ప్రొఫెసర్లు హాజరై ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. తాజాగా హిందీ విభాగం ఆధ్వర్యంలో 'మానవీయ సంవేదన, సాహిత్య కే విభిన్న స్వర్' అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నారు. అధ్యాపక బృందం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఉస్మానియా, తిరుపతి ఎస్వీయూ, ఇఫ్లూ(హైదరాబాద్), ధర్మాబాద్, నాసిక్, థానే తదితర యూనివర్సిటీల హిందీ విభాగాధిపతులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు.

సెమినార్లతో ప్రయోజనం...

ఆయా సబ్జెక్టులపై జాతీయ సెమినార్ల నిర్వహణ ద్వారా కళాశాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని అధ్యాపకులు చెబుతున్నారు. కళాశాలకు సైతం గుర్తింపు పెరుగుతుందని పేర్కొంటున్నారు. కళాశాలకు ప్రస్తుతం న్యాక్ బి గ్రేడ్ గుర్తింపు ఉండగా, భవిష్యత్తులో గ్రేడ్ ఉన్నతీకరణకు ఈ సెమినార్లు దోహదపడతాయని అంటున్నారు. తద్వారా కళాశాలకు నిధులు రావడంతో విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పిస్తామని చెబుతున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి సంబంధిత సబ్జెక్టు నిపుణులు ఇక్కడికే వచ్చి అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థులకు ఆయా విషయాలపై సంపూర్ణ అవగాహన పెరుగుతుందని తెలిపారు.

హిందీపై అవగాహన కోసం...



డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిందీ ఆధ్వర్యంలో 'మానవీయ సంవేదన్, సాహిత్య కే విభిన్న స్వర్' అనే అంశంపై జాతీయ సెమినార్ ఏర్పాటు చేశాం. ఈ సెమినార్‌కు వివిధ వర్సిటీల హిందీ విభాగాధిపతులు హాజరు కానున్నారు. హిందీపై విద్యార్థులకు విస్తృత అవగాహనకు ఈ సెమినార్ ఉపయోగపడుతుంది.

– పవన్‌కుమార్ పాండే, అసోసియేట్ ప్రొఫెసర్(హిందీ), జీఆర్పీ డిగ్రీ కళాశాల, భైంసా

ఏర్పాట్లు చేశాం...



భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీపై ఒకరోజు జాతీయ సెమినార్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం. గతేడాది జీవ వైవిధ్యంపై సెమినార్ విజయవంతంగా పూర్తి చేశాం. ఉమ్మడి జిల్లాలోనే ఎక్కడా లేనివిధంగా కళాశాలలో జాతీయ సెమినార్ నిర్వహించడం గర్వంగా ఉంది.

– డాక్టర్ ఎం.సుధాకర్, ప్రిన్సిపాల్

రన్నింగ్‌లో బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న దంపతులు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బూర్గుడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వైరగాడే ఆనంద్ రావు, శకుంతల దంపతులు రన్నింగ్ సీనియర్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ నెల 7న ఖమ్మంలో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో దంపతులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. 1500 మీటర్ల రన్నింగ్‌లో ఆనంద్ రావు, 800 మీటర్లలో శకుంతల బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

బినామీ డీలర్‌పై కేసు



రేషన్‌షాపు తనిఖీ చేస్తున్న అధికారులు

జైనూర్: బినామీ డీలర్ల ఏరివేతలో భాగంగా మండలంలోని రాసిమెట్ట గ్రామానికి చెందిన రేషన్ షాపులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు శ్రీనివాస్, శ్యామ్‌లాల్ సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్ పేరు శేక్ ఫజల్ ఉండగా మోసిన్ అనే వ్యక్తి షాపు నిర్వహిస్తున్నాడు. అంతేకాకుండా 1.5 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉండటంతో బినామీ డీలర్ పై 6–ఏ కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

చికిత్స పొందుతూ మైనింగ్ సర్దార్ మృతి



మృతదేహం పరిశీలిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2గనికి చెందిన మైనింగ్ సర్దార్ మచ్చ రమేశ్(32) గోదావరిఖని సింగరేణి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గత నెల 21న నార్త్‌లో 11లెవెల్ వద్ద కాలుజారి పడిపోవడంతో కాలికి గాయాలయ్యాయి. బీజోన్ ఆస్పత్రికి తరలించగా అక్కడి నుంచి గోదావరిఖనికి తరలించారు. ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డ కట్టడంతో ఎక్స్‌రే నిమిత్తం తరలిస్తున్న క్రమంలో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గని ప్రమాదంగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. ఏఐటీయూసీ నాయకుడు సీతారామయ్య డైరెక్టర్‌తో చర్చలు జరపడంతో యాజమాన్యం ఒప్పుకోవడంతో ఆందోళన విరమించారు. కాగా విధి నిర్వహణలో ప్రమాదం జరిగిన వ్యక్తిని కరీంనగర్, హైదరాబాద్ ఆస్పత్రులకు తరలించకుండా జాప్యం చేయడం విమర్శలకు తావిస్తోంది. బాధితుడిని విధుల్లో చేరాల్సిందిగా అధికారులు ఒత్తిడి చేయడంతో పాటు వైద్యంలో నిర్లక్ష్యం చేయడంతో మృతి చెందినట్లు యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయమై పూర్తిస్థాయిలో విచారణ జరిపి వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి, మాదారం టౌన్‌షిప్‌ల్లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం మహిళలు, యువతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోలేటిలో టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్.. మాదారంలో మగ్గం, బ్యూటీషియన్ కోర్సులకు ఉచిత శిక్షణ అందించనునట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 15 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులను పర్సనల్ డిపార్టుమెంట్‌లోని సేవా సమితి కోఆర్డినేటర్‌కు అందించాలన్నారు. పూర్తి వివరాలకు 9951214116 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

తల్వార్‌తో భయపెట్టిన యువకుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపిస్తున్న ఎస్‌హెచ్‌ఓ

బెల్లంపల్లి: పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని రోడ్డుపై కేక్‌కట్ చేసి ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురి చేసిన వేర్వేరు ఘటనల్లో ఇద్దరు యువకులను సోమవారం అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్ తెలిపారు. కన్నాల బస్తీకి చెందిన దాసరి అజయ్ గతనెల 29న రాత్రి రోడ్డుపై పొడవాటి తల్వార్‌తో కేక్ కట్ చేశాడు. అంతటితో ఆగకుండా ఆ తల్వార్‌ను అందరికి చూపిస్తూ భయభ్రాంతులకు గురి చేశాడు. వీడియో ఇటీవల సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. రెండురోజుల క్రితం పోస్టాఫీసు బస్తీ ఏరియాలో హరికృష్ణ అనే యువకుడి పుట్టిన రోజు సందర్భంగా అనపర్తి సాయి పవన్ అనే యువకుడు కూడా తల్వార్‌ను చేతపట్టుకుని పాటో దిగి వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నాడు. ఆయా ఘటనల్లో నిందితులిద్దరినీ పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.